తేదీ 07.4.2006, శ్రీరామ నవమి, సాయికుల్వంత్ సభామండపం

# మన ఆత్మయే రాముడు

**'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'.**

**మీరు పరులు కాదు, పరమాత్మ స్వరూపులే!**

ఖండఖండాంతర ఖ్యాతినార్జించినటువంటి మహనీయులను గన్న మాతృభూమి ఈ భరత భూమి. అనాదికాలమునుండి అనేకమంది మహర్షులు భారతదేశములో రామతత్త్వమును, రామనామ విశిష్టతను ప్రచార ప్రబోధలు చేసి తమ కాలమును సార్థకము గావించుకొని, సత్కీర్తిని గడించారు. రామాయణము జరిగింది అనేక వేల సంవత్సరాల క్రిందట త్రేతా యుగములో. అప్పటి రామాయణము ఇప్పటికి కూడను పిల్లలు మొదలుకొని పెద్దలవరకు అందరి హృదయాలలోనూ చిరస్థాయిగా నిలిచిపోయింది. ప్రతి పల్లెయందు ప్రజలు రామమందిరమును నిర్మించుకొని 'రామా, రామా, రామా' అంటూ ఆనందంగా రామనామస్మరణ చేస్తున్నారు. రామనామం స్మరించని భారతీయుడు ఎక్కడా కనిపించడు. ఏ నామమును మరచినప్పటికీ రామనామమును ఎవ్వరూ మరువరు, మరువలేరు. కూటిపేదగాని, కోటీశ్వరుడుగాని కష్టము వచ్చినప్పుడు 'రామా' అని తలుస్తూనే ఉంటారు. అయితే, రాముడు తన నామాన్ని స్మరించమని ఎప్పుడూ చెప్పలేదు. "మీరందరూ నా స్వరూపులే", అన్నాడు.

ధర్మమనేది ఒక ప్రత్యేకమైన ప్రదేశములో లేదు. అందరియందు ఉన్నది ధర్మము ఒక్కటే. రాముడు ధర్మస్వరూపుడు. ధర్మము సత్యమనే మూలాధార తత్త్వమునుండి పుట్టినది. "సత్యాన్నాస్తి పరో ధర్మః". సత్యమే లేక ధర్మమే లేదు. కనుక, మొట్టమొదట మనము సత్యాన్ని పాటించాలి. ఏది చెబుతామో అది చేయాలి. చెప్పుట ఒకటి, చేయుట మరొకటి అయినప్పుడు అది అధర్మంగా మారుతుంది. చెప్పినట్లు చేయుటయే మానవుని ప్రధాన కర్తవ్యము. ఐతే, ఏదైనా చెప్పేముందు చక్కగా విచారించి, ముందువెనుకలు యోచించి, 'ఇది సరియైనది' అనే విషయాన్ని మనసులో దృఢం చేసుకొని ఆ తరువాతనే చెప్పాలి. రాముడు చెప్పినది ఒక్కటే ఒక్కటి – సత్యమును పాటించాలి. సత్యమును ఆధారం

sri sathyasai vachanamrutam

చేసుకొని ధర్మమును పోషించుకోవాలి. 'ధారయతీతి ధర్మః'. మనము ధరించినటువంటిదే ధర్మము. ధర్మమే మనకు ఆధారం. ధర్మమంటే బీదలకు అన్నం పెట్టడం, దాన ధర్మాలు చేయడం కాదు. ధర్మమనేది హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. దానిని మనస్ఫూర్తిగా ఆచరించాలి. 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం' అన్నారు. 'నేను మానవుడను' అని నీవు చెప్పుకుంటున్నావు. కాని, ఎప్పుడు నీవు మానవుడవవుతావు? మనసు, మాట, క్రియల ఏకత్వాన్ని సాధించినప్పుడే నీవు మానవుడవవుతావు. కేవలం మానవుడవే కాదు, మహాత్ముడవవుతావు. ఈ మూడింటి ఏకత్వాన్ని సాధించిన వాడు రాముడు. 'మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం'. అతడే రావణుడు. సత్యమును పాటించినవాడు రాముడు; అసత్యము ననుసరించినవాడు రావణుడు. సత్యాసత్యములకు, ధర్మాధర్మములకు మధ్యమధ్య ఘర్షణలు జరుగుతూనే ఉంటాయి.

**సత్యమే సృష్టికి పునాది**

సత్యముకంటే మించిన ధర్మము మరొకటిలేదు. కనుక, చిన్నచిన్న విషయాలలోకూడా మనము సత్యమునే పలకాలి. ఏదో అప్పటికప్పుడు కష్టము నుండి తప్పించుకొనే నిమిత్తమై అసత్యమాడకూడదు.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న?**
**శుద్ధసత్వమిదియె చూడరయ్య!**

ఈ సృష్టి అంతయు సత్యమునుండియే పుట్టినది. సత్యమే సృష్టికి పునాదివంటిది. ఈ పునాది ఏమైనా కదిలెనా, ఈ ప్రపంచమే కదిలిపోతుంది. ప్రపంచ మనగా మన దేహమే. ఈ దేహమునందు నిండి ఉన్నదంతా పంచభూతములు, పంచేంద్రియములు, పంచప్రాణములే. ఇవన్నీ సత్యమునుండియే ఆవిర్భవించాయి. పంచభూతములు ఎక్కడున్నవి? సర్వత్రా నిండి ఉన్నవి. ఈ పంచభూతములు తప్ప ఆరవ భూతము ఎక్కడా కనిపించడం లేదు. ఉన్నవి అయిదే. అవే మానవునియందుకూడా సూక్ష్మరూపమును

sri sathyasai vachanamrutam

ధరించియున్నవి. మానవ దేహములో ఉన్నటువంటి సత్యమును చక్కగా తెలుసుకొని దానిని మనము అభివృద్ధిపరచుకుంటూ రావాలి. ఈనాటి మానవులు పడే బాధలకు, కష్టములకు మూలకారణం సత్యమును విస్మరించడమే! అసత్యమును అనుసరించడంచేత మానవుడు అవమానములకు గురియై అపకీర్తిని పొందుతున్నాడు. 'సత్యము' అనేది చాలా చిన్న పదమేగాని, మహత్తరమైన అంతరార్థముతో కూడినది. 'సత్' అనగా శాశ్వతమైనది, మార్పు లేనిది. అటువంటి సత్యమును మార్చడానికి ప్రయత్నించడంచేతనే మనలో కూడా మార్పు కలుగుతున్నది.

**భగవద్వాక్యమే సత్యము**

విద్యార్థులారా! ఈ లేత వయస్సునుండియే మీరు సత్యమును పాటిస్తూ వచ్చినప్పుడు తప్పక దేశానికే ఆదర్శప్రాయులు కాగలరు. అసలు ఏది సత్యము? భగవద్వాక్యమే సత్యము. కనుక, మీరు పలికే ప్రతి పలుకు 'సర్వం భగవత్ ప్రీత్యర్థం' అనే భావముతో పలికినప్పుడు అదే సత్యముగా రూపొందుతుంది. మన హృదయమునుండి ఆవిర్భవించే ప్రతి భావముకూడా సత్యముయొక్క ప్రతిబింబమే. కాని, అది నాలుకపైకి వచ్చేసరికి దానిని అసత్యంగా మార్చుకుంటున్నాము. ఈ ఇంద్రియాలవల్లనే మనము చాలా మార్పు చెందుతున్నాము. మన పాపపుణ్యాలకు ఇంద్రియాలే కారణం. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస - ఇవి మానవతా విలువలు. సత్యమనేది దారిని చూపుతుంది. ధర్మము దానిని అనుసరిస్తుంది. ప్రేమను అనుభవించినప్పుడు అహింస ఏర్పడుతుంది. హింస అనగా ఎవరినో కొట్టడం, తిట్టడం, బాధించడం ... ఇంత మాత్రమే కాదు. నీ వాక్కును నీవు అనుసరించకపోవడంకూడా హింసయే. మొట్టమొదట నీ వాక్కును నీవు సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టు. దానికంటే మించిన అహింస మరొకటి లేదు.

**కల్పితము చేయబట్టి మీలో కల్మషము ప్రవేశిస్తున్నది**

ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. దానికి మీరేమాత్రము కల్పితము చేయకూడదు. మీరు కల్పితము చేయబట్టి మీలో కల్మషము ప్రవేశిస్తున్నది. మీ హృదయము కల్మషం కావడానికి మూలకారణం మీరు సత్యాన్ని మార్చుకోవడమే. కల్మషాన్ని దూరం చేసుకోవాలంటే

srisathyasaivachanamrutam

పవిత్రమైన సత్యాన్ని పలుకుతూ రావాలి. సత్యాన్ని పలుకుతూ ఉంటే మీరు చెప్పినవన్నీ జరుగుతాయి. ఐతే, మీరు ప్రశ్నించవచ్చు, "స్వామీ, మేము సత్యమార్గములో వెళుతున్నప్పటికీ అసత్యమనేది చేరి మమ్మల్ని బాధపెడుతున్నది. దీనికి కారణమేమిటి?" అని. అసలు అసత్యమనేది ఎట్లా వచ్చి చేరుతున్నది? మీరు అవకాశమివ్వడంవల్లనే అది చేరుతున్నదిగాని, లేకపోతే చేరదు. పవిత్రమైన గంగ ప్రవహిస్తుంటే దానికి మధ్యమధ్య వర్షపు నీరు వంకలుగా వచ్చి కలుస్తుంటుంది. అయితే, మీరు సత్యములో మరి ఏ ఒక్కదానినీ ప్రవేశపెట్టకూడదు. కాని, ఇంద్రియాల బలహీనతచేత మీరు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములకు అవకాశ మిస్తున్నారు. ఇవన్నీ చేరి మీ మనసును అపవిత్రంగావిస్తున్నాయి. పరిశుద్ధమైన అమృతబిందువునందు అణుమాత్రము అశుద్ధము చేరినా అది అపవిత్రమైపోతుంది.

**మనస్సే అందరాని చందమామ**

ఒక మ్యూజిక్ డైరెక్టర్ వ్రాశాడు, "అందరాని చందమామవని తెలుసు, అందుకో జూచు ఎందుకో నా మనసు" అని. ఆ అందరాని చందమామ ఎక్కడో ఆకాశములో లేదు; మనస్సే అందరాని చందమామ. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే మేఘాలు అడ్డురావడంచేత చంద్రుడు మరుగునపడి పోతున్నాడు. 'అయ్యో, నాకు చంద్రుడు కనిపించడంలేదే', అని బాధపడకూడదు. మేఘాలు కదలిపోతూనే చంద్రుడు కనిపిస్తాడు. అదేరీతిగా, అరిషడ్వర్గాలనే మేఘాలు కదలిపోవడానికి మీరు ఎల్లప్పుడు నామస్మరణ చేయాలి. అప్పుడే మీరు చంద్రుణ్ణి సుస్పష్టంగా చూడడానికి వీలవుతుంది.

ఈనాడు మనము శ్రీరామనవమి పండుగను జరుపుకుంటున్నాము. శ్రీరామ చంద్రుడు ప్రధానంగా బోధించినవి సత్య, ధర్మములే! మిమ్మల్ని మీరు సామాన్య మానవులుగా భావించుకోకూడదు. "నేను రాముణ్ణి" అని మీరు విశ్వసించాలి. అప్పుడప్పుడు మీరంటుంటారు, 'నా ఆత్మారామునికే తెలుసు' అని. కనుక, మన ఆత్మయే రాముడు. ఆత్మకు ఒక రూపం లేదు. ఆత్మ భౌతికంగా ఒక రూపాన్ని ధరించి రామునిగా అవతరించడం జరిగింది. అట్లే, ధర్మమే లక్ష్మణునిగా బాహ్యస్వరూపాన్ని ధరించి వచ్చింది.

srisathyasaivachanamrutam

అతను నిరంతరం రాముని అనుసరిస్తూ వచ్చాడు. రాముడే తన సర్వస్వం అని భావించాడు. తన ధన, దారాది సర్వభారములను సమర్పించి రామునికి అతను శరణాగతుడైనాడు.

**మనం సంచరించే ప్రదేశం కూడా మన మనస్సుపై ప్రభావం చూపుతుంది**

సీతారామలక్ష్మణులు అరణ్యంలో సంచరిస్తుండగా ఒక ప్రదేశానికి వెళ్ళేసరికి లక్ష్మణునిలో ఎక్కడ లేని దుర్మార్గపు బుద్ధులు పుట్టినాయి. వెంటనే రామునితో, "రామా! ఎందుకు నీకీ అవస్థలు? అమాయకురాలైన సీతమ్మను ఇంత బాధపెట్టడమెందుకు? తక్షణమే మనము అయోధ్యకు వెళ్ళెదము, రమ్ము", అన్నాడు. సీత చాలా ఆశ్చర్యపడింది. రామునికి సర్వము తెలుసు కనుక చిరునవ్వు నవ్వుతూ, "లక్ష్మణా, ఇటు రమ్ము" అని దగ్గరికి పిలిచి తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాడు. లక్ష్మణుడు తన పొరపాటును గ్రహించి, "అన్నా! ఏనాడూ రానటువంటి చెడ్డ భావాలు ఈనాడు నాలో ఎందుకు ప్రవేశించాయి?" అని అడిగాడు. అప్పుడు రాముడు, "నాయనా! ఇందులో నీ దోషమేమీ లేదు. ఇది రాక్షసులు సంచరించే ప్రదేశం. అందుచేత, నీలో రాక్షస భావాలు ప్రవేశించాయి", అన్నాడు. Tell me your company, I shall tell you what you are. మీరు ఎలాంటివారితో స్నేహం చేస్తారో అలాంటి భావాలే మీలో ప్రవేశిస్తాయి. కనుక, దుస్సంగానికి దూరంగా ఉండండి. సత్సంగములో చేరండి. మంచివారితో కలసిమెలసి మెలగండి. అప్పుడు మీలో కూడా మంచి భావాలు వస్తుంటాయి. 'యద్భావం తద్భవతి'. భావమును బట్టి ఫలితముంటుంది.

శాంతి అనేది ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ప్రత్యేకంగా కనిపించదు. అంతా మనయందే ఉన్నది. మన దేహమే ఒక పెద్ద ప్రపంచము. దీనిలోనే అన్ని రకములైన గుణములు కలసిమెలసి ఉంటున్నాయి. దీనిని మంచిగా మార్చుకోవడం మన చేతిలోనే ఉన్నది. "భగవంతుడు ఎందుకు దీనిని మార్చకూడదు?" అని మీరడుగవచ్చు. ఇందులో పరమాత్ముడేమీ జోక్యం చేసుకోడు. "ఇది మంచిది, అది చెడ్డది" అని తాను మీకు బోధించనవసరం లేదు. మీ భావములే మీకు బోధిస్తుంటాయి. మీరు ఏది తింటే అదే మీకు త్రేపుగా వస్తుంది. మామిడిపండు తింటే దోసపండు త్రేపు వస్తుందా?! కనుక, మీలో

sri sathyasai vachanamrutam

ఉన్నటువంటివే మీకు వస్తుంటాయిగాని, మీలో లేనివి రావడానికి వీల్లేదు. కనుక, ఎవరిపైన ఏ చెడ్డభావము వచ్చినప్పటికీ అది మీలో ఉన్నదేగాని, వారిలో ఉన్నది కాదు.

**ఏది జరిగినా మనమంచికే!**

కొంతమంది నిరంతరం ఏవో ఆలోచనల్లో మునిగి ఉంటారు. ఆలోచనల్లో మునిగినవారికి కించిత్తైనను ఆనందము చిక్కదు. ఆలోచనలు లేకుండా నిశ్చలంగా ఉన్నటువంటివారియందే ఆనందము ఆవిర్భవిస్తుంది. మీకు తెలివితేటలు దండిగా ఉన్నాయనే భావనతో మీరు చదివిన విషయాలను లోతుగా విచారిస్తూ పరిశోధనలు చేస్తుంటారు. ఈ 'బుకిష్ నాలెడ్జి' అనేది కేవలం ఒక 'ఎలర్జీ'గా బయలుదేరుతున్నది. ఈ 'ఎలర్జీ' ప్రారంభమయ్యేసరికి మీలో సహజంగా ఉన్న 'ఎనర్జీ' తగ్గిపోతున్నది. ఈనాటి మానవుడు కేవలం 'ఎలర్జీ'ని పెంచుకుంటున్నాడుగాని, 'ఎనర్జీ'ని పెంచుకోవడం లేదు. 'ఇది నాకు మంచిదా కాదా?' అనే విచారమే మీరు చేయనక్కర్లేదు. Everything is good. అన్నీ మంచివే. ఏది జరిగినా, 'ఇదంతా నా మంచికోసమే' అని భావించాలి. ఆవిధంగా మీరు భావించుకుంటూ ఉంటే మీకంతా మంచే జరుగుతుంది.

ప్రేమస్వరూపులారా! అందరినీ ప్రేమించండి. ఎవ్వరినీ ద్వేషించకండి. ఎవరిపైనకూడా ఏవిధంగానూ అపోహకు చోటివ్వకండి. కొందరు భగవంతునిపై కూడా అపోహపడుతుంటారు. అది మరింత పాపము. It is the worst of sins. కనుక, మీరు ఆవిధమైన అపోహలకు చోటివ్వకండి. అటువంటి ఆలోచనలు వచ్చినప్పుడు 'ఛీ, ఇవి నా శత్రువులు' అని భావించి వాటిని ప్రక్కకు నెట్టివేయండి. ఎప్పుడూ ప్రేమతో ఉండండి. ప్రేమయే మిమ్మల్ని రక్షిస్తుంది. ప్రేమయే మిమ్మల్ని పోషిస్తుంది. ప్రేమయే మిమ్మల్ని అన్నివిధాలుగా కాపాడుతుంది. ఎందువల్ల? మీరుకూడా ప్రేమస్వరూపులే! ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ ద్వేషము ప్రవేశించుటకు వీలులేదు.

**సుఖానికి పొంగవద్దు, దుఃఖానికి క్రుంగవద్దు**

రాముడు అడవికి వెళ్ళే సమయంలో కౌసల్య ఘొల్లున ఏడ్చింది. సుమిత్ర వచ్చి, 'అక్కా! ఎందుకు ఏడ్వడం? రాముడు అరణ్యానికి పోతున్నాడనా? అతని నివాసము అరణ్యమని,

sri sathyasai vachanamrutam

మన నివాసము అయోధ్య అని భావించి నీవు పొరబడుతున్నావు. రాముడు ఉన్న అరణ్యమే అయోధ్య, రాముడు లేని అయోధ్యయే అరణ్యము. సుఖదుఃఖములు ఒకదాని తరువాత ఒకటి అలల మాదిరి వస్తుంటాయి, పోతుంటాయి. వాటికి మనము ఏమాత్రము లొంగకూడదు. సుఖము వచ్చిందని పొంగకూడదు; దుఃఖము వచ్చిందని క్రుంగకూడదు. సుఖదుఃఖములపట్ల మనం సమత్వం పాటించాలి. ప్రపంచంలో ఈ రెండూ లేకుండా ఎవరైనా ఉండగలరా?! రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తి మయుడు. అతనిని ఏ క్రూరమృగములుగాని, ఏ రాక్షసులుగాని బాధించలేరు", అని ధైర్యం చెప్పింది. 'రామునివెంట సీతకూడా అరణ్యానికి వెళుతున్నదే! ఆమె ఈ కష్టాలను ఏవిధంగా భరించగలదు?' అని కౌసల్య బాధపడింది. రాముడుకూడా చెప్పాడు, 'సీతా! అరణ్యం ముళ్ళపొదలతో నిండి వుంటుంది. క్రూరమృగాలనుండి తప్పించుకోవడం చాలా కష్టం. అక్కడ నీవు చాలా బాధలకు గురి కావలసి వస్తుంది", అని. అప్పుడు సీత, "రామా! ఈ ప్రపంచాన్నంతా సంరక్షించే నీకు సీతను కాపాడుకోవడం చేతకాదా? ఈ మాటలు నేను నమ్మను. నీవు సర్వజ్ఞుడవు, సర్వశక్తిమంతుడవు, సర్వవ్యాపకుడవు, సర్వాంతర్యామివి. కాబట్టి, క్రూర మృగములు నన్నేమీ చేయజాలవు. నీవు ప్రక్కనుంటే నాకెట్టి భయమూ లేదు", అన్నది. సీత మాటలకు రాముడు ఎంతో సంతోషించాడు.

సీత అపహరణకు గురియైనప్పుడు లక్ష్మణుడు ఉగ్రుడై, "అన్నా! ఆజ్ఞ ఇవ్వు. ఒక్క క్షణంలో రాక్షసు లందరినీ భస్మం చేస్తాను", అన్నాడు. అప్పుడు రాముడు, 'లక్ష్మణా! ఆ పని నీవూ నేనూ చేయనక్కర్లేదు. వాళ్ళని వాళ్ళే భస్మం చేసుకుంటారు. వారి దుర్గుణములే వారిని నశింపజేస్తాయి. ఎవరెవరి ప్రారబ్ధానుసారము, ఎవరెవరి గుణములననుసరించి వారావిధంగా ప్రవర్తిస్తుంటారు. వారి ప్రవర్తనకు తగిన ఫలితం వారే అనుభవిస్తారు' అని చెప్పి లక్ష్మణుని శాంతపరచాడు.

**'నాది' అనుకున్నది నీది కాదు**

'ఇవి నావి' అనుకున్నంతవరకు నీకు దుఃఖము తప్పదు. 'ఇవి నావి కాదు. ఇవన్నీ దైవస్వరూపములే!" అని నీవు భావించాలి. సర్వకర్మలను భగవత్ప్రీత్యర్థం ఆచరించాలి.

srisathyasaivachanamrutam

'నేను', 'నాది' అనే అహంకార మమకారములు పెట్టుకొంటివా, అన్నివిధాలుగా భస్మమైపోతావు. 'నాది, నాది' అంటున్నావు. ఏది నీది? 'నా దేహము', 'నా మనస్సు', 'నా బుద్ధి', 'నా చిత్తము', 'నా ఇంద్రియములు' అని అంటున్నావుగాని, నిజానికి ఇవి ఏవీ నీవి కాదు. 'నాది' అనుకునే దేహము నీకు తెలియకుండానే ఏ క్షణములోనైనా నిన్ను వదలిపెట్టిపోతుంది. 'నాది' అనుకునే మనస్సు నీ అదుపులో లేకుండా పిచ్చికోతి మాదిరి అటూ ఇటూ తిరుగుతుంటాది. దీనిని పట్టుకోవడానికి నీకు సాధ్యమవుతుందా? కాబట్టి, దీనిని వదలిపెట్టేసెయ్. 'నేను అది', 'నేను ఇది' అని నీవు ఏమాత్రము పోల్చుకోకూడదు. 'నీవు ఎవరు?' అనే ప్రశ్నకు I am I (నేను నేనే) అన్నదే సరియైన జవాబు. రాముడు బోధించినటువంటి సత్యమిదియే!

**మంచి చేస్తే చెడు రావడానికి వీల్లేదు**

రాముడు ఎవ్వరినీ ఏవిధముగాను బాధించలేదు. ఎవ్వరినీ ఎప్పుడుకూడను దూషించలేదు; హింసించలేదు. కాబట్టి, ఇతరులకు రామునిపై ఎందుకు ద్వేషం వస్తుంది?! రాముడు చేసిన మంచి రామునికే వస్తుందిగాని, చెడు ఎట్లా వస్తుంది?! మంచి చేస్తే మనకు చెడు రావడానికి వీలే లేదు; కష్టములు, నష్టములు రావడానికి వీలేలేదు. మనకు బాధలు కలుగుతున్నాయంటే, అందుకు కారణం మన ప్రయత్న లోపము, ఇంద్రియ దోషములే తప్ప అవి భగవంతుడు పెట్టే బాధలు కానే కావు. మనం ఇంద్రియాలను కంట్రోలు చేసుకుంటే అన్నీ మన కంట్రోలులోకి వస్తాయి. అదియే రాముడు అందించిన సందేశ సారాంశము. రామాయణమును మనము ఏదో ఒక వ్యక్తి కథగా చెప్పుకుంటూపోతే మన దుఃఖం నివారణ కాదు. ఇది కేవలం మనందరి కథయే! మన భావములయొక్క మార్పుచేతనే భగవంతునిపై మనము నెపము వేస్తున్నాము. భగవంతునికి ఎవరిపైనకూడా ద్వేషము లేదు. అందరినీ చూసి చిరునవ్వులు చిందిస్తూనే ఉంటాడు. చిరునవ్వు భగవంతుని సహజ స్వభావము. ఎక్కడ చిరునవ్వు ఉంటుంటాదో అక్కడ ద్వేషము రావడానికి వీలే లేదు. అలాంటివారిని ఎవ్వరూ బాధపెట్టలేరు. కనుక, మీరెప్పుడూ నవ్వు మొహంతో ఉండండి. ఎప్పుడు చూసినా 'కేస్టరాయిల్ ఫేస్' పెట్టుకొని ఉండకూడదు. పరీక్షలు వచ్చినాయంటే,

sri sathyasai vachanamrutam

'అయ్యో, నేనెట్లా వ్రాస్తానో!' అని ఆందోళన చెందకూడదు. 'ఈ పరీక్షలు ఇంకో రెండు నెలల తరువాత వస్తే బాగుండునే', అని అనుకోకూడదు. పరీక్షలు రావడం మంచిదే! ఎంత త్వరగా పరీక్షలు వస్తే అంత త్వరగా పాసై పైతరగతులకు పోవచ్చు అని ఆనందించాలి. హైయర్ క్లాసులకు పోవడానికి తొందరపడాలి. ఈవిధమైన hurry (తొందరపాటు) ఉంటే మనకు worry (చింత) ఉండదు.

**మహర్షులు తయారు చేసిన మహాద్భుతమైన మిఠాయి - రామనామము**

రామనామమను మిఠాయి ఇదిగో! రండి భక్తులారా!
భూమిలో దొరకే మిఠాయిని కొని తిని
పామరులై చెడిపోవకురండీ ॥రామ॥

వేదసారమను గోధుమపిండిలో
వేదవాక్యమను క్షీరమె పోసీ
ఆధారమైన పెద్ద భాండము దీసీ
ఆది మునులు దీని పాకము బట్టిరి ॥రామ॥

సుబుద్ధియను కండచక్కెర తెచ్చీ
నిబద్ధియను ఆవు నెయ్యే వేసి
అబద్ధమనియెటి మలినము దీసి
ఆది మునులు దీని పాకము బట్టిరి ॥రామ॥

*(ఈ కీర్తన గానం చేసిన తరువాత భగవాన్ తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

మీరు బయటికి వెళ్ళి ఏవేవో పిచ్చిపిచ్చి మిఠాయిలంతా కొనుక్కొని తింటే మీ కడుపు చెడిపోతుంది. ఆ మిఠాయిలు తినడానికి చాలా రుచిగా అనిపించవచ్చు గాని, అవి విషంతో సమానం. రామనామమనేది మహర్షులు తయారు చేసినటువంటి మహాద్భుతమైన మిఠాయి. ఇది ఏమాత్రం చెడిపోయేటటువంటి పదార్థము కాదు. ఈ మిఠాయిని మీరు

sri sathyasai vachanamrutam

తినేకొలదీ మీకు ఎంతో ఆనందం కలుగుతుంది.

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతి రుచ్యము నోటను పల్క పల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్**
**చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్!**

ఇంతవరకు ఎన్నో అవతారములు వచ్చాయి. కాని, ఏ అవతార నామమైననూ ఇంత శాశ్వతంగా ఉందా? లేదు. అనాదికాలమునుండి ఈనాటివరకు రామనామమనేది అందరికీ తారకమంత్రముగా తనరారుచున్నది. ఈనాడు పిల్లలు మొదలుకొని వృద్ధులవరకు అందరూ రామనామాన్ని స్మరిస్తూనే ఉన్నారు. రామనామమాధుర్యాన్ని అనుభవించడానికి వయస్సుతో నిమిత్తం లేదు. 'రామ' అనే రెండక్షరాలలో ఎంతో మాధుర్యము ఇమిడియున్నది. ఇటువంటి మధురమైన, అమృతమయమైన, ఆనందమయమైన రామనామాన్ని మనము క్షణమైనా విడిచిపెట్టకూడదు. కాని, ఈనాటి విద్యార్థులు దివ్యమైన రామనామాన్ని అలక్ష్యం చేస్తున్నారు. అది వారి దురదృష్టమనే చెప్పవచ్చు.

**అనన్యభక్తితో కృష్ణ పరమాత్మలో ఐక్యమైన మీరా**

మహాభక్తురాలైన మీరాను మహారాణా కృష్ణ మందిరమును వదలిపెట్టి వెళ్ళిపొమ్మన్నాడు. "నేను కృష్ణుణ్ణి వదలిపెట్టి ఎలా వెళ్ళేది!" అని ఆమె చాలా బాధపడింది. "కృష్ణుడే నావెంట వస్తాడు", అని సమాధానపడి ద్వారకకు బయల్దేరింది. "స్వామీ! నేను ఎన్నో శ్రమలకోర్చి నీ నామమనే పెద్ద ముత్యమును సంపాదించాను. ఆ ముత్యము నా చేతిలోనుండి జారిపడిపోకుండా కాపాడు", అని కృష్ణుని ప్రార్థించింది. మీరా ద్వారక చేరుకునేసరికి అక్కడ కృష్ణమందిరం తలుపులు మూయబడివున్నాయి. "కృష్ణా! అక్కడ మహారాణా నీ మందిరం తలుపులు మూశాడు. ఇక్కడకూడా నిన్ను దర్శించే భాగ్యం నాకు లేదా?" అని ఆక్రోశిస్తూ ఆమె మందిరం తలుపులకు తలను కొట్టుకోసాగింది. తక్షణం తలుపులు తెరుచుకున్నాయి. కృష్ణ పరమాత్మ ప్రత్యక్షమై మీరాను తనలో లీనం చేసుకున్నాడు. ఈవిధంగా, ఎవరెవరి భక్తి,

sri sathyasai vachanamrutam

ఎవరెవరి భావము ఎంత గాఢంగా ఉంటుందో, ఎంతో బలంగా ఉంటుందో, ఎంత లోతుగా ఉంటుందో చెప్పడానికి వీలుకాదు. మనం హృదయాన్ని విశాలం గావించుకోవాలి. హృదయం అంటే భౌతికమైన గుండె కాదు. మన గుండె పెద్దదిగా అయిందంటే డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటారు. మన భావాలను విశాలం గావించుకోవాలి. నీవు కాళ్ళను జాపుకొని స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకొనే బదులు కాళ్ళను ముడుచుకొని కూర్చుంటే మరొకరు వచ్చి నీ ప్రక్కన కూర్చోవచ్చు కదా! ఆవిధంగా ఒకరికొకరు తోడ్పాటు నందించుకోవాలి. అందరికీ అవకాశము లభించేటటువంటి మార్గాన్ని మనము గుర్తించాలి.

**తల్లిదండ్రులకు ఆనందాన్నివ్వడానికే పుట్టాము**

విద్యార్థులారా! వేసవి సెలవులు ప్రారంభమైనవి. మీరు మీమీ స్వస్థలాలకు వెళుతున్నారు. ఇక్కడ చదివిన చదువులను, విన్నటువంటి విషయాలను మననం చేసుకుంటూ హాయిగా ఉండండి. మీ తల్లిదండ్రులనుకూడా సంతోషపెట్టండి. ఏవిషయంలోనూ వారికి బాధ కలిగించకండి. మీరు ఆనందంగా ఉంటే మీ తల్లిదండ్రులుకూడా ఆనందంగా ఉంటారు. తల్లిదండ్రులే మనకు చాలా ప్రధానమైనవారు. కనుకనే, 'మాతృదేవో భవ, పితృదేవో భవ' అన్నారు. వారిని ఆనందింపజేయడమే మన ప్రధాన కర్తవ్యం. మీ తిండి మీరు తింటూ, మీ సుఖాన్ని మీరు చూసుకుంటే చాలదు. మొట్టమొదట తల్లిదండ్రులను సుఖపెట్టాలి. 'ఖానా, పీనా, సోనా మర్నా' (తినడం, త్రాగడం, నిద్రించడం, మరణించడం) – ఇది కాదు జీవితమంటే. మనం పుట్టింది తిని తిరగడానికి, సుఖాలను అనుభవించడానికి కాదు. తల్లిదండ్రులను ఆనందింపజేయడంకోసమే మనము పుట్టాము. ఈనాడు మీ తల్లిదండ్రులను మీరు సంతోషపెడితే భవిష్యత్తులో మీ పిల్లలు మిమ్మల్ని సంతోషపెడతారు. మీరు ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. అప్పుడే మీరు ధన్యులవుతారు. సత్యసాయి కాలేజీలో మీరు చదివిన చదువు సార్థకమవుతుంది. అట్టి కీర్తిని మీరు సంపాదించాలని నేను ఆశిస్తున్నాను.

(తేదీ 07.4.2006, శ్రీరామ నవమి, సాయికుల్వంత్ సభామండపం)

srisathyasaivachanamrutam